

# ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలి

- క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

2




# సంగారెడ్డి మెదక్

ఆదివారం 30 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:09


# 22ఏపై కాంగ్రెస్ సర్కారుపై హరీష్‌రావు ఫైర్

-పేదల భూములు నిషేధిత జాబితా నుంచి బేషరతుగా తొలగించాలి

-లేకపోతే సంగారెడ్డి కలెక్టరేట్ ముట్టడిస్తాం..

-రెవెన్యూ మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

- మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు







**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)**

ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై కేసులు పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. 22ఏ పేరుతో పట్టా భూములు, ఇళ్లు, ప్లాట్లు, వ్యవసాయ భూములను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.తెలంగాణలో సుమారు 50 వేల ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దారుణమన్నారు. మిగతా 2 లో

# రోడ్డు కోసం బీ ఆర్ఎస్ పార్టీ పాదయాత్ర

- నిజాంపేట్ మండల్ నందగోకుల్ గ్రామం నుండిచెల్మెడ గ్రామం కమాన్ వరకు బీటీ రోడ్డు నిర్మించాలి
- రోడ్డు పూర్తయ్యే వరకు ప్రజల పక్షాన పోరాటం - మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి





**మెదక్ (ప్రజాజ్యోతి )**

నందగోకుల్ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నందగోకుల్ నుంచి చెల్మెడ కమాన్ వరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్రను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి పద్మాదేవేందర్‌రెడ్డి మరియు మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి తో కలిసి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. నందగోకుల్ నుంచి ప్రారంభమైన పాదయాత్రకు స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మిగతా 2 లో

# ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 29:-**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.నోటీసులు అందజేసిన అనంతరం తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని సూచించారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై శనివారం ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీ, హియరింగ్ తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు బూత్ లెవల్ అధికారులకు ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తూ, ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సంగారెడ్డి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సంగీత, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను అనుసరిస్తూ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నామని సీఈఓ కు తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం నియోజకవర్గాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. నోటీసుల పంపిణీని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని మరింత వేగవంతం చేయాలని ఈఆర్ఓలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ గరిష్ట సంఖ్యలో నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేసి, తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని సూచించారు.పోలింగ్ స్టేషన్ వారీగా, మండలాల వారీగా ప్రతిరోజూ నోటీసుల పంపిణీ పురోగతిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నోటీసుల పంపిణీ పెండింగ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మిగిలిన నోటీసుల పంపిణీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తూ, అర్హులైన ప్రతి ఓటరుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంగీత, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు కోసం బీ ఆర్ఎస్ పార్టీ పాదయాత్ర

మొదటిపేజీ తరువాయి

రహదారి దుస్థితిని ప్రత్యక్షంగా పరిశీలిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ నాయకులు పాదయాత్ర కొనసాగించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. నందగోకుల్‌చెల్మెడ కమాన్ మధ్య రహదారి పూర్తిగా అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రహదారి సక్రమంగా లేకపోవడంతో రైతులు, విద్యార్థులు, వాహనదారులు, ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారని, వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నందగోకుల్‌చెల్మెడ రహదారి అభివృద్ధి కోసం రూ.13 కోట్ల నిధులు మంజూరు చేసి పనులకు మార్గం సుగమం చేశామని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం దారుణమని విమర్శించారు. కనీసం తట్టెడు మట్టి కూడా వేయకుండా ప్రభుత్వం ప్రజల సమస్యను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.

### ప్రజల ఇబ్బందులు ప్రభుత్వానికి కనిపించడం లేదా?

ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు ప్రయాణించే రహదారి ఇంత అధ్వానంగా ఉన్నా ప్రభుత్వానికి కనిపించడం లేదా అని శేరి సుభాష్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నిసార్లు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని స్పష్టం చేశారు.మంజూరైన రూ.13 కోట్ల నిధులతో నందగోకుల్‌చెల్మెడ కమాన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### రోడ్డు పూర్తయ్యే వరకు ఉద్యమం ఆగదు

ప్రజల సమస్య పరిష్కారం అయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని శేరి సుభాష్‌రెడ్డి స్పష్టం చేశారు. నందగోకుల్‌చెల్మెడ కమాన్ బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని తేల్చిచెప్పారు.ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ పాదయాత్రలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని "నందగోకుల్‌చెల్మెడ రోడ్డు నిర్మించాలి" అంటూ నినాదాలు చేస్తూ పాదయాత్రను కొనసాగించారు.

# 22ఏపై కాంగ్రెస్ సర్కారుపై హరీష్‌రావు ఫైర్

మొదటిపేజీ తరువాయి




కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. పేద, మధ్యతరగతి, కార్మిక వర్గాలు అధికంగా ఉన్న పటాన్‌చెరు ప్రాంతంలో 22ఏ సమస్య కారణంగా అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లో పెట్టి రాహుల్ గాంధీ చోద్యం చూస్తున్నారా అని హరీష్‌రావు ప్రశ్నించారు. ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టిన ప్రభుత్వం బ్రోకర్లతో లాబీయింగ్ వ్యాపారం చేయిస్తోందని ఆరోపించారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే భక్షకులుగా మారిందని తీవ్రస్థాయిలో విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు సంబంధించిన ఇళ్లు కూడా ఒకప్పుడు నిషేధిత జాబితాలో ఉన్నాయని, అధికారాన్ని ఉపయోగించి వాటిని జాబితా నుంచి తొలగించుకున్నారని ఆరోపించారు. మరి సామాన్య ప్రజలు మాత్రం తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించుకోవడానికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఎందుకు తిరగాలని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని హరీష్‌రావు ఎద్దేవా చేశారు. "సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతుంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం భూముల చుట్టూ తిరుగుతున్నారు" అంటూ విమర్శించారు. కేసీఆర్ హయాంలో ప్రజారంజక పాలన సాగితే, రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజాకంటక విధానాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలిందని, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిందని అన్నారు. మంత్రి పొంగులేటిపై కూడా హరీష్‌రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "పొంగులేటి అత్యాశే ఆయన రాజకీయ పతనానికి కారణమవుతుంది" అని హెచ్చరించారు.యాదాద్రి జిల్లాలో సుమారు 40 వేల ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని స్వయంగా క్యాబినెట్ మంత్రి చెప్పినా ముఖ్యమంత్రి స్పందించడం లేదని విమర్శించారు. నిషేధిత జాబితాలో ఉన్న నిరుపేదల ఇళ్లు, భూములను ఎలాంటి షరతులు లేకుండా 22ఏ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.పేదల భూములను వెంటనే 22ఏ జాబితా నుంచి తొలగించకపోతే సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హరీష్‌రావు హెచ్చరించారు. 22ఏ వ్యవహారంలో రెవెన్యూ మంత్రి వైఫల్యానికి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, మంత్రి పొంగులేటిని తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

# కొప్పోల్ లో శ్రావణమాస పూజలు..

మెదక్ (ప్రజా జ్యోతి)

వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేసిన కందుకూరి రవి దంపతులు.. పెద్ద శంకరంపేట మండల పరిధిలో ఉన్న కొప్పోల్ లో శ్రీ ఉమా సంఘమేశ్వరాలయంలో శ్రావణ మాస శనివారం రోజు భక్తులు విశేషంగా పూజలు అభిషేకాలు వేకువ జామునే నిర్వహించిన భక్తులు అందులోనే భాగంగా పెద్ద శంకరంపేటకు చెందిన కందుకూరి రవి సెట్ దంపతులు స్వామివారికి అభిషేకాలు పూజలు వేద మంత్రోచ్చరణల మధ్య నిర్వహించి భక్తులకు అన్న ప్రసాద వివరణ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పెద్ద చింతకుంట గ్రామంలో విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

## - బట్టలు ఆరవేస్తుండగా ప్రమాదం

## - ఇద్దరు పిల్లలకు తల్లి దూరం

నర్సాపూర్ ఆగస్టు 29:

బట్టలు ఆరవేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై పట్నం లావణ్య (30) మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట గ్రామంలో శనివారం నాడు చోటుచేసుకుంది.గ్రామస్తుల వివరాల ప్రకారం లావణ్య ఇంటి పక్కనే ఉన్న పశువుల షెడ్డులో బట్టలు ఆరవేస్తుండగా ఇనుప దండెంకు విద్యుత్ వైరు తగిలి ఉండటాన్ని గమనించలేదు.దండెంను తాకడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాద సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో ఆమెను కాపాడే అవకాశం లేకపోయింది. మృతురాలికి 12 ఏళ్ల కుమారుడు, 8 ఏళ్ల కుమార్తె ఉన్నారు. లావణ్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.






# బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన పాదయాత్రను ఖండించిన టిఆర్ఎస్

మెదక్ (ప్రజా జ్యోతి)

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రపై టిఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి బట్టి అజయ్ తీవ్రంగా విమర్శించారు. బీ ఆర్ఎస్ పార్టీ గత 10 సంవత్సరాలు గా పరిపాలనలో మీరే స్థానిక ఎమ్మెల్యేగా ఉన్నారు కదా అప్పుడు ఈ రోడ్డు గుర్తుకు రాలేదా అని తీవ్రస్వరంతో ఖండించారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కూడా గత మూడు సంవత్సరాల నుంచి ఆ రోడ్డు విషయాన్ని పట్టించుకోవడం లేదు. బిఆర్ఎస్ కానీ కాంగ్రెస్ కానీ ప్రజలను మభ్యపెట్టి కాలాన్ని వెల్లబుచుతున్నాయని తెలిపాడు. కొత్తగా వచ్చిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించకుండా పాదయాత్రలు చేయడం సరికాదని ఆయన అన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని బట్టి అజయ్ సూచించారు. పద్మా దేవేందర్ రెడ్డి గారు మెదక్ నగరానికి కూతవేటు దూరంలో ఉన్న మగ్దుంపూర్ (గడమన్ పల్లి) మీ పరిపాలన ఈ రోడ్డు అస్తవ్యస్తంగా తయారై ప్రజలకు చాలా ఇబ్బందులు గురవుతున్నారు.ఇవన్నీ పట్టించుకోలేదు కానీ ఇప్పుడు మీరు అధికారంలో లేరని ప్రజలను మభ్యపెట్టి ఏదో విషయాలను ప్రజలపై రుద్దడం సరికాదని తెలిపారు.





# కార్యదర్శిపై సర్పంచ్ భర్త దాడికి యత్నం

## - కేసు నమోదు విచారణ కు ఆదేశాలు ఎస్సై రవి గౌడ్

కల్హేర్, ఆగస్టు (ప్రజా జ్యోతి):

కల్హేర్ మండలంలోని బీబీపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి నక్కబాల వెంకట రంగయ్యపై సర్పంచ్ భర్త దాడికి యత్నించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





పంచాయతీ కార్యదర్శి పై చెయ్యెత్తి దాడి చేస్తున్న సర్పంచ్ భర్త బండారి సాయిలు దృశ్యం



ఎస్సై రవిగౌడ్

తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పంచాయతీలో దోమల నివారణకు మందుల పిచికారీ చేసే విషయంలో కార్యదర్శి, సర్పంచ్ భర్త మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. దోమల బెడదను నివారించేందుకు వార్డు సభ్యులు మందులు కొనుగోలు చేసి తీసుకువచ్చారు.ఈ క్రమంలో శుక్రవారం సర్పంచ్ భర్త కార్యదర్శి వద్దకు వెళ్లి మందులు ఎందుకు పిచికారీ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ విషయమై ఇద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. అనంతరం సర్పంచ్ భర్త కార్యదర్శిపై దాడి చేసేందుకు యత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటనపై జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు జగన్, ప్రధాన కార్యదర్శి రాజు కల్హేర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి దుస్సంఘటనలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి కార్యదర్శులపై భద్రత కల్పించడానికి తక్షణ సహాయం అందించాలని వారు పిలుపునిచ్చారు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిగౌడ్ తెలిపారు.

# రెండు గంటల్లో వాహనం దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు



## - చాకచక్యంగా ద్విచక్ర వాహనం స్వాధీనం

## - నారాయణఖేడ్ ఎస్సై రాసుల శ్రీశైలం

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 29:**

ద్విచక్ర వాహనం దొంగతనం జరిగిన రెండు గంటల్లోనే కేసును ఛేదించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నారాయణఖేడ్ ఎస్సై రాసుల శ్రీశైలం అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నారాయణఖేడ్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి హట్యా నాయక్ తండాకు చెందిన మేఘావత్ హన్మ నాయక్ తన హీరో ఫ్యాషన్ ప్రో ద్విచక్ర వాహనం టీఎస్15ఈటీ9659ను శుక్రవారం రాత్రి ఇంటి ముందు నిలిపి ఉంచాడు. ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించకపోవడంతో నారాయణఖేడ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.ఫిర్యాదు అందుకున్న నారాయణఖేడ్ ఎస్సై రాసుల శ్రీశైలం వెంటనే దర్యాప్తు చేపట్టి, సిబ్బందితో కలిసి చాకచక్యంగా వ్యవహరించారు. సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని సేకరించి దర్యాప్తు కొనసాగించగా, దొంగిలించబడిన వాహనం నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులో గల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద ఉన్నట్లు గుర్తించారు.వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు. దొంగతనం జరిగిన కొద్ది గంటల్లోనే వాహనాన్ని గుర్తించి స్వాధీనం చేసుకోవడంపై బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.వాహన దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో నిలిపి ఉంచడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# మెట్ల నిర్మాణంపై వివాదం.. ముగ్గురిపై కేసు ఎస్ ఐ. రవి గౌడ్

## మాసాన్‌పల్లిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

## ఫిర్యాదు మేరకు కేసు నమోదు.. దర్యాప్తు కొనసాగింపు

**కల్హేర్: 29.ఆగస్టు. ప్రజా జ్యోతి.**

సంగారెడ్డి జిల్లా కల్హే ర్ మండలంలోని మాసాన్‌పల్లి గ్రామంలో ఇంటి ముందు మెట్ల నిర్మాణం విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిపై కల్హేర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.







### వాగ్వాదం నుంచి ఘర్షణకు ..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎంబరి నాగార్జున ఇంటి ముందు మెట్లు నిర్మిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన మాల్పెద్ది నారాయణ, అతని కుమారుడు దత్తు, అల్లుడు పండరి అక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అనంతరం పరిస్థితి ఘర్షణకు దారితీసినట్లు తెలిపారు.

### ఇద్దరికి గాయాలు

ఘర్షణలో నారాయణ, అతని కుమారుడు మహేంద్ర గాయపడినట్లు బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై కల్హేర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

దర్యాప్తు కొనసాగింపుబాధితుల ఫిర్యాదు మేరకు మాల్పెద్ది నారాయణ, దత్తు, పండరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై రవిగౌడ్ పర్యవేక్షణలో ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నదని, గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది..

# జాతీయ క్రీడా దినోత్సవంసందర్భంగా రన్



**మెదక్ (ప్రజాజ్యోతి )**

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 7 గంటలకు మెదక్ జిల్లా కేంద్రంలో క్రీడా ఉత్సాహం వెల్లివిరిసింది. జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్‌ను జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ జెండా ఊపి ప్రారంభించారు.మెదక్‌లోని వెల్కమ్ బోర్డు చౌరస్తా నుంచి ధ్యాన్‌చంద్ చౌరస్తా వరకు పురుషులకు ఐదు కిలోమీటర్లు రన్నింగ్ నిర్వహించగా. మెదక్ కొత్త బస్టాండ్ నుంచి ధ్యాన్‌చంద్ చౌరస్తా వరకు బాలికలకు రెండు కిలోమీటర్ల రన్ నిర్వహించారు. కార్యక్రమంలో యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడలను జీవితంలో భాగంగా చేసుకోవాలని, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు.జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, క్రీడా శాఖ సిబ్బంది, విద్యార్థులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై లయన్స్ క్లబ్ ప్రత్యేక శ్రద్ధ

- 600 మంది విద్యార్థులకు ఉచిత దంత, ఎనిమియా పరీక్షలు
- పాఠశాల స్థాయిలోనే ఆరోగ్య సమస్యల గుర్తింపు

**అందోల్, ఆగస్టు 29, (ప్రజాజ్యోతి):**

విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై కూడా శ్రద్ధ అవసరమనే ఉద్దేశంతో జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అందోలు గురుకుల బాలికల పాఠశాలలో శనివారం నిర్వహించిన శిబిరంలో సుమారు 600 మంది విద్యార్థులకు దంత పరీక్షలు, ఎనిమియా పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించారు.ప్రోగ్రాం చైర్మన్ ఆకుల రాంబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ సద్గుణ మేరీ గ్రేసి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐకేఎస్ ఫౌండేషన్ డాక్టర్ సాయికుమార్ నేతృత్వంలోని వైద్య బృందం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించింది. పాఠశాల స్థాయిలోనే ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన సూచనలు, చికిత్స అందించడం ఈ శిబిరం ప్రత్యేకతగా నిలిచింది.కార్యక్రమానికి అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి, ఎంఈఓ కృష్ణ, జోగిపేట మార్కెట్ చైర్మన్ ఎం. జగన్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఉపయోగకరంగా ఉంటాయని వారు పేర్కొన్నారు.లయన్స్ డిస్ట్రిక్ట్ పీఆర్వో డాక్టర్ కే. అనంతరెడ్డి, కార్యదర్శి మల్లేష్, కోశాధికారి సంతోష్, సభ్యులు ప్రదీప్‌గౌడ్, రవిశేఖర్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాస్, నాయకులు అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల పట్ల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ లేబర్ (డీసీఎల్) తీవ్ర నిర్లక్ష్యం

**మెదక్ (ప్రజా జ్యోతి )**



వాయిదాల పర్వం గా కార్మికులకు సమస్యల పరిష్కారం కోసం డీసీఎల్ ఆఫీసుకు రావాలని సమయం ఇస్తూ, తీరా వెళ్తే డీసీఎల్ అందుబాటులో ఉండటం లేదని విమర్శించారు. ఈ నెల 12, 19, 22, మరియు 29వ తేదీలలో వాయిదాలు వేస్తూ కార్మికులను తిప్పించుకుంటున్నారని పేర్కొన్నారు.యాజమాన్యాల సాకులు డీసీఎల్ కార్యాలయం నుండి పాత ఆఫీసుల పేర్లతో యాజమాన్యాలకు లేఖలు జారీ అవుతున్నాయని, దీనిని యాజమాన్యాలు ఆసరాగా తీసుకుంటున్నాయని కార్మికులు ఆరోపించారు.అధికారుల నిర్లక్ష్యం దీనిపై డీసీఎల్‌ను సంప్రదిస్తే, తాను "ఎలక్షన్ పని మీద ఉన్నానని, మేనేజ్‌మెంట్‌తో మాట్లాడుకుని పొమ్మని" సమాధానం ఇస్తున్నట్లు తెలిపారు. కార్మిక శాఖ అధికారులు వెంటనే స్పందించి మెదక్ జిల్లా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిచో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కావేరి పరిశ్రమ కార్మికులు పాల్గొన్నారు.

# రసాయన శాస్త్రంలో - కిరణ్ కుమార్‌కు పీహెచ్‌డీ

- నూతన ఔషధ సమ్మేళనాల పరిశోధనలో కీలక అధ్యయనం
- ఫావిపిరావిర్ తయారీ విధాన అభివృద్ధిపై విశేష పరిశోధన

**పటాన్ చెరు(ప్రజాజ్యోతి) ఆగస్టు 29:**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి వున్నం కిరణ్ కుమార్ డాక్టరేట్ పట్టాకు అర్హత సాధించారు. ఔషధ రసాయన శాస్త్ర రంగంలో వినూత్న పరిశోధన నిర్వహించిన ఆయన సిద్ధాంత వ్యాసాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించి పీహెచ్‌డీ పట్టాకు అర్హత పొందారు.'ఎస్-బినోల్ ఫాస్ఫేట్, 2,4-థయాజోలిడిన్ డయోన్ ఉత్పన్నాల సంశ్లేషణ, వాటి జీవక్రియాశీలతల పరిశీలన, ఫావిపిరావిర్ తయారీ విధాన అభివృద్ధి' అనే అంశంపై కిరణ్ కుమార్ పరిశోధన చేపట్టారు. ఈ పరిశోధనకు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కనకదుర్గా భాస్కర్ యమాజాల మార్గదర్శకత్వం వహించారు.కిరణ్ కుమార్ పరిశోధన గణనీయమైన చికిత్సా సామర్థ్యం కలిగిన నూతన హెటెరోసైక్లిక్ సమ్మేళనాల రూపకల్పన, సంశ్లేషణ, జీవ మూల్యాంకనంపై ప్రధానంగా దృష్టి సారించింది. యాంటీవైరల్ ఔషధమైన ఫావిపిరావిర్ కోసం మెరుగైన, విస్తరించదగిన సంశ్లేషణ ప్రక్రియను అభివృద్ధి చేయడంతో పాటు యాంటీ బాక్టీరియల్, యాంటీ డయాబెటిక్, యాంటీ క్యాన్సర్ కార్యకలాపాలకు ఉపయోగపడే ఆశాజనకమైన ఎస్-బినోల్ ఫాస్ఫేట్, 2,4-థయాజోలిడిన్ డయోన్ ఉత్పన్నాలను గుర్తించినట్లు తెలిపారు.ఈ పరిశోధన ద్వారా పారిశ్రామిక అనువర్తనాలకు ఉపయోగపడే ఆచరణాత్మక సంశ్లేషణ పద్ధతులు అందుబాటులోకి రావడంతో పాటు, భవిష్యత్ ఔషధ అభివృద్ధి, ప్రీ-క్లినికల్ పరిశోధనలకు బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు.కిరణ్ కుమార్ డాక్టరేట్ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. ఔషధ రసాయన శాస్త్ర పరిశోధనకు కిరణ్ కుమార్ చేసిన విలువైన కృషిని ప్రశంసించారు.

# రైతుల సమస్యలపై ఎమ్మెల్యే మాణిక్‌రావు చొరవ

**జహీరాబాద్, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి న్యూస్)**

శనివారం జహీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కొణింటి మాణిక్‌రావు హద్నూర్ గ్రామ సర్పంచ్ ఎం.ప్రవీణ్ కుమార్, మాజి సర్పంచ్ రాజ్ కుమార్, షబ్బీర్ ఖాన్ తో పాటు న్యాల్కల్ మండల రైతులు కలిసి టిజిఐసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిశారు. న్యాల్కల్, ఝరాసంగం మండలాల్లోని వివిధ గ్రామాలకు సంబంధించి అనెక్సర్2లో కొత్త సర్వే నంబర్లు, అదనంగా చూపిన భూ విస్తీర్ణా లపై స్పష్టత ఇవ్వాలని వారు కోరారు. గతంలో 12,645 ఎకరాల భూమికి సంబంధించిన సర్వే నంబర్లు నోటిఫై చేయబడినప్పటికీ, ప్రస్తుతం కొత్తగా కొన్ని సర్వే నంబర్లు, భూ విస్తీర్ణాలు చేర్చడంపై రైతుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అధికారు లను కోరారు. రైతు లకు నష్టం కలగకుండా పూర్తి స్థాయి స్పష్టత ఇవ్వాలని, సంబంధిత రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



# కార్యదర్శిపై దాడిని ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన

## - కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**కల్వ్ ర్. 29.ఆగస్టు. ప్రజా జ్యోతి.**

కల్వేర్: బీబీపేట్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రంగయ్యపై సర్పంచ్ సంతోషవ్వ భర్త సాయిలు దాడి చేసిన ఘటనను ఖండిస్తూ పంచాయతీ కార్యదర్శులు శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విధుల్లో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించిన కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఎంపీడీవో హరినందన్ రావు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.



**ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు**

.విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులను కొందరు ప్రజాప్రతినిధులు, ప్రజా నాయకులు చిన్నచూపు చూడటం సరికాదని ఆయన పేర్కొన్నారు. కార్యదర్శిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరుతూ ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. దాడికి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు.


# క్రీడల ద్వారా స్నేహ భావం ఏర్పడుతుంది

## - కోహిర్ మండలం మనియార్ పల్లి గ్రామంలో

## జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**జహీరాబాద్, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి న్యూస్)**

జాతీయ హాకీ ప్లేయర్ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతి కార్యాలయంలో గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో యువత సమావేశం ఏర్పాటు చేసిన కారిక్రమంలో ముఖ్య అతిధిగా జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా హజరై ఎం.ఎస్. ఫౌండేషన్ సహకారాంతో మనియార్ పల్లి గ్రామ యువతకు క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అస్మా మాట్లాడుతూ.. లి ఖేలేగా భారత్ జీతేగా భారత్ " లక్ష్యంతో రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, యువతను క్రీడల వైపు ప్రోత్సహిం చాల్సిన అవసరాన్ని వివరించారు. మన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు ఎంతో ప్రాధాన్యత నిస్తున్నారు ప్రభువ్వము క్రీడా యూనివర్సిటీ లను ఏర్పాటుచేసేవిధంగా కృషి చేస్తుందన్నారు. ఆటలు శరీరానికి శక్తిని, దృఢత్వాన్ని ఇస్తాయి. నేటి డిజిటల్ యుగంలో మొబైల్ లకు దూరంగా మైదానంలో ఆడే ఆటలు మనల్ని ఆరోగ్యంగా, మనసునుచురుగ్గా ఉంచి ఒత్తిడిని తగ్గించి ఏకాగ్రతను పెంచు తాయి. టీమ్‌వర్క్, బాధ్యత, పట్టుదల వంటి గొప్ప గుణాలు ఆటల ద్వారానే అలవడ తాయి అన్నారు. క్రీడలు యువత అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని, యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కారిక్రమంలో గ్రామ మాజీ సొసైటీ డైరెక్టర్ భాగయ్య, మాజీ స్కూల్ చైర్మన్ సయ్యద్ గఫార్, దర్గా సదర్ షాబుద్దీన్, వార్డు సభ్యులు విట్టల్, స్వప్న, సాయి కుమార్, సద్దాం గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు షఫీయుద్దీన్, గ్రామ యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరిలో దైవత్వం ఉంది

## - దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు

## - వైభవంగా మృత్యుంజయ లక్ష జప మహాయజ్ఞం

**జహీరాబాద్, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి న్యూస్)**

ప్రతి ఒక్కరిలోనూ దైవత్వం ఉందని,దేహమే దేవాలయం జీవుడే దేవుడు అని మానవ సేవ చేయాలని, మనుషు లందరూ సమానమేనని భావిస్తూ ముందుకు సాగాలని బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్ధేశ్వరానందగిరి, ఆధ్యాత్మికవేత్త రాచయ్య స్వామి పేర్కొన్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని లోకకల్యాణం, సకల జీవుల ఆరోగ్యం, ఆయురా రోగ్యాలు, శాంతి, సౌభాగ్యం కోసం శనివారం దత్తగిరి ఆశ్రమంలో మృత్యుంజయ లక్ష జప మహా యజ్ఞాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 11.45 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛా రణలు, మంగళవాయిద్యాల నడుమ వేదోక్తంగా యాగ శాలలో ప్రవేశించారు. వేద విద్యార్థులు, భక్తులు సామూహికంగా మృత్యుంజయ మంత్రాన్ని లక్షసార్లు జపించారు. యజ్ఞ శాలలో అగ్నిదేవుడికి వివిధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా ఆహుతులు సమర్పిస్తూ మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 2.11 గంటలకు వేదమంత్రాల ఘోష, మంగళవాయిద్యాల నడుమ పూర్ణాహుతి చేశారు. యజ్ఞంలో 11మంది దంపతులు యజ్ఞ యజ మానులుగా వ్యవహ రించారు. రాత్రికి శివ పార్వతుల కళ్యాణం, బసవపురాణం, భజన సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందిని గిరి మాత, ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్ పాటిల్, కోట శ్రీనివాస్, నాగన్న పాటిల్, బి కృష్ణ, దత్తు, అర్చకులు శ్రీపద్ స్వామి, నాగయ్య స్వామి, వేద పాఠశాల విద్యార్థులు వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.





# సెప్టెంబర్ 1న కేంద్రంపై సీపీఐ రణభేరి

- కేంద్రంపై సీపీఐ రణభేరి.. సెప్టెంబర్ 1న 'ఢిల్లీ చలో'!- మార్పు తప్పనిసరి' అంటూ పిలుపునిచ్చిన

- కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన సీపీఐ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ జలాల్

- మార్పు తప్పనిసరి' నినాదంతో సెప్టెంబర్ 1న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ.

- సామాన్యుడి నడ్డివిరుస్తున్న ధరల మంట తగ్గాలి.. ప్రతి యువకుడికి ఉద్యోగం ఇవ్వాలి

- ఈవీఎంలను రద్దు చేసి, బ్యాలెట్ విధానాన్ని పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి- రైతులకు మద్దతు ధర, దళిత-ఆదివాసీలకు న్యాయం కోసం రాజీలేని పోరాటం



**జహీరాబాద్ ఆగస్టు 29 (ప్రజా జ్యోతి న్యూస్)**

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) దేశవ్యాప్త సమరశంఖం పూరించింది. సామాన్యుల బతుకులు బుగ్గిపాలవుతున్న తరుణం లో, ప్రజల హక్కుల కోసం, దేశ ఉజ్వల భవిష్యత్ కోసం 'మార్పు తప్పనిసరి' (జష్ఘుఅస్త్రవఅం చీవఎవంయిఖీఎ) అనే నినాదంతో సెప్టెంబర్ 1, 2026 న 'ఢిల్లీ చలో' మహార్యాలీకి జాతీయ నాయకత్వం పిలుపు నిచ్చింది. ఈ మహా ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ జలాల్ విలేకరుల సమా వేశంలో కీలక ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానం వేదికగా జరగనున్న ఈ భారీ బహిరంగ సభలో జిల్లా నలుమూలల నుంచి సీపీఐ శ్రేణులు,కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున కదిలి రావాలని పిలుపునిచ్చారు. సయ్యద్ జలాల్ వెల్లడించిన ప్రధాన డిమాండ్లు ఇవే. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం కేవలం కొద్దిమంది బడా బాబులకే కొమ్ము కాస్తోందని సయ్యద్ జలాల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మహా ర్యాలీలో ప్రధానంగా ఎనిమిది కీలక ప్రజా సమస్యలపై సీపీఐ జాతీయ స్థాయిలో గళమెత్తు తోందని ఆయనపేర్కొన్నారు. రోజు రోజుకూ ఆకాశాన్నంటు తూ సామాన్యుల జేబులకు చిల్లులు పెడుతున్న నిత్యావసరాల ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు.దేశంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తోందని, ప్రతి యువకుడికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. పౌరులందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. అలాగే మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేసి తీరాలని స్పష్టం చేశారు. దేశానికి అన్నంపెట్టే రైతన్నల పంటలకు కనీస మద్దతు ధరకు (యంఎస్ పి) చట్టబద్ధత కల్పించాలని, కార్పొరేట్ల దోపిడీ నుంచి కార్మికుల హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు సయ్యద్ జలాల్ వెల్లడించారు. బ్యాలెట్ తెండి. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.ప్రస్తుత ఎన్నికల వ్యవస్థపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన నెలకొందని జలాల్ పేర్కొన్నారు. ఈవీఎంల (జుఎవీ) పనితీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. వెంటనే వాటిని రద్దు చేసి, తిరిగి పాత బ్యాలెట్ పేపర్ విధానాన్ని పునరుద్ధరించడం ద్వారానే దేశ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోగల మని సీపీఐ ప్రధానంగా కోరుతోందని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో అణగదొక్కబడు తున్న దళిత, ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, అకృత్యాలను తక్షణమే అరికట్టా లని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అభివృద్ధి పేరుతో ప్రాజెక్టులకింద భూములుకోల్పోతున్న నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి, వారికి తగిన న్యాయం, నష్టపరిహారం అందే వరకు సీపీఐ రాజీలేని పోరాటం చేస్తుందని సయ్యద్ జలాల్ తన ప్రకటనలో తీవ్రంగా హెచ్చరించారు.

# ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్)పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు కార్యాచరణ రూపొందించాలి...

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 29:**



జిల్లాలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి విద్యార్థిలో నిర్దేశిత అభ్యసన సామర్థ్యాలు సాధించేలా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు.శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ సమీక్ష సమావేశంలో , ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు, విద్యార్థుల అభ్యసన స్థాయులు, పాఠశాలల పనితీరు, మూల్యాంకన ఫలితాలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రతి పాఠశాలలో విద్యార్థుల ప్రస్తుత అభ్యసన స్థాయి అంచనా ఫలితాల ఆధారంగా మెరుగైన విద్యను అందించాలని పేర్కొన్నారు.జిల్లా లో మొత్తం 254 ఎఫ్ఎల్ఎన్ కాంపిటీంట్ పాఠశాలలో ఉన్నాయని అందులో చదువుతున్న విద్యార్థులందరికీ ఎఫ్ ఎల్ ఎన్ కాంపిటీన్సీర్ రావాలని వచ్చే విధంగా సూపర్వైజింగ్ చేయాలని సూచించారు.ఈ విద్యా సంవత్సరం పూర్తయ్యే నాటికి ఎఫ్ఎల్ఎన్ కాంపిటీన్సీర్ తగ్గట్టు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.మూల్యాంకన ఫలితాల ఆధారంగా విద్యార్థులలో ఉన్న అభ్యసన లోపాలను గుర్తించి, వాటి నివారణకు లోప నివారణ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు.విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్, గణితం అంశాల్లో ప్రాథమిక సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రతి మండలంలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించేందుకు ఆకస్మిక మూల్యాంకనం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఎఫ్ఎల్ఎన్ కి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. పాఠశాల లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి స్థాయికి అనుగుణంగా బోధనా పద్ధతులను అనుసరించి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలని సూచించారు. విద్యార్థులలో చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తెలిపారు.పాఠశాలల్లో లక్ష్య నిర్ధారణ పోస్టర్లు ఏర్పాటు చేసి, నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత పర్యవేక్షణ బృందాలు పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి ఎఫ్ఎల్ఎన్ అమలును పరిశీలించాలని సూచించారు.ప్రతి పాఠశాలలో విద్యార్థుల విషయాల వారీ సామర్థ్యాలు, సాధించిన ఫలితాలు, అభ్యసన లోపాలు గుర్తించి, తక్కువ స్థాయి ఫలితాలు ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సాధించాలని సూచించారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశాల ద్వారా తల్లిదండ్రులకు కూడా ఎఫ్ఎల్ఎన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, విద్యార్థుల అభ్యసన పురోగతిని తల్లిదండ్రులతో పంచుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి అవసరమైన ప్రాథమిక సామర్థ్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి, జిల్లా సమగ్ర శిక్షణ కోఆర్డినేటర్ బాలయ్య, విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత పర్యవేక్షణ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# 25వ వార్డులో అభివృద్ధికి మరో ముందడుగు

## - డ్రైవర్ కాలనీలో సిసి మురికి కాలువ నిర్మాణానికి శంకుస్థాపన

## - చేసిన మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్

## -మున్సిపల్ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపిన- కౌన్సిలర్ జాకీర్, కాంగ్రెస్ నాయకులు ముస్తఫా



**జహీరాబాద్, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి న్యూస్)**



జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని వార్డు నెంబర్ 25 డ్రైవర్ కాలనీలో సీసీ మురికి కాలువ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపే దిశగా ఈ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, డ్రైవర్ కాలనీ ప్రాంతం గత అనేక సంవత్సరాలుగా గ్రామపంచాయతీ పరిధిలో ఉండటంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగ లేదన్నారు. మున్సిపాలిటీలో విలీనం అయ్యే సమయానికి ఈ ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో లేక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. మున్సిపాలిటీలో విలీనమైన ప్రాంతాల్లో నెలకొన్న సమస్య లను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులను చేపడు తున్నామని చైర్మన్ పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజల నిత్య జీవితానికి అవసర మైన రోడ్లు, డ్రైనేజీ, మురికి కాలువలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ కాలనీలో మురికి నీరు నిల్వ ఉండకుండా, వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా సిసి మురికి కాలువ నిర్మాణాన్ని చేపడు తున్నామని అన్నారు. ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతకు డ్రైనేజీ వ్యవస్థ ఎంతో కీలకమని వివరించారు. మున్సిపాలిటీలో విలీనమైన ప్రాంతాల్లో అనేక సంవత్సరా లుగా పేరుకు పోయిన సమస్యలు ఉన్నాయని, వాటన్నిటినీ ఒకేసారి పరిష్కరించడం సాధ్యం కాక పోయినా ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్క సమస్యకు పరిష్కరిస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళు తున్నామని చైర్మన్ మహమ్మద్ యూనుస్ తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్య లను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని, అందుబాటులో ఉన్న నిధులు మరియు ప్రభుత్వ సహకారంతో అవసరమైన అభివృద్ధి పనులను చేపడతామని అన్నారు. జహీరాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డును సమానంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చైర్మన్ తెలిపారు. డ్రైవర్ కాలనీలో చేపడుతున్న సిసి మురికి కాలువ నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు డ్రైనేజీ సమస్య నుంచి కొంత ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ జాకీర్, కాంగ్రెస్ నాయకులు ముస్తఫా చైర్మన్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.ప్రభాకర్, ఏఈ ఖాజా, వార్డు కౌన్సిలర్ జాకీర్, కాంగ్రెస్ నాయకులు ముస్తఫా, ఇసమోద్దీన్, సలీం, మున్సిపల్ సిబ్బంది ఇస్మాయిల్, ఖదీర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అనామలీస్ నోటీసులపై హియరింగ్ ప్రారంభం

## - పోలింగ్ కేంద్రాల వారీగా విచారణ

## - హాజరు కాకుంటే ఓటు తొలగించే అవకాశం





**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 29:**

ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా అనామలీస్ (ఓటరు వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న) జాబితాలో చోటు పొంది నోటీసులు అందుకున్న ఓటర్లకు శనివారం నుంచి నారాయణఖేడ్ పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో పోలింగ్ కేంద్రాల వారీగా హియరింగ్ ప్రారంభమైంది. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు అధికారులు సూచించిన తేదీ, సమయంలో తప్పనిసరిగా విచారణకు హాజరై తమ ఓటు హక్కును కాపాడుకోవాలని అధికారులు సూచించారు.ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ మ్యాపింగ్ కానివారు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారు విచారణకు హాజరై తమ వివరాలను ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. నిర్దేశిత తేదీన హాజరు కాలేని వారికి మరోసారి అవకాశం కల్పిస్తామని అధికారులు తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే నిబంధనల ప్రకారం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### పారదర్శకత కోసం పరిశీలన

ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు, అనర్హమైన పేర్లు లేకుండా పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు అనామలీస్ జాబితాపై విచారణ చేపడుతున్నారు. ప్రతి ఓటరు తమ పేరు, వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించుకోవాలని సూచించారు. నోటీసులు అందుకుని విచారణకు హాజరు కాకపోతే తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉన్నందున ఓటర్లు నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. అనారోగ్య పరిస్థితుల కారణంగా భౌతికంగా విచారణకు హాజరు కాలేని వారికి మాత్రమే మినహాయింపు ఉంటుందని అధికారులు తెలిపారు.

### బీఎల్ఓ ధ్రువీకరణ పత్రం కూడా సరిపోతుంది

అనామలీస్ నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వివరాలను ధ్రువీకరించుకునేందుకు సంబంధిత బీఎల్ఓ ఇచ్చే ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించవచ్చని అధికారులు తెలిపారు. అవసరమైన వివరాలు, పత్రాలను బీఎల్ఓకు అందజేసి ధ్రువీకరణ పొందవచ్చని సూచించారు. విచారణ ప్రక్రియలో ఓటర్లు బీఎల్ఓలకు సహకరించాలని కోరారు.



### హాజరు కావాల్సిందే: మున్సిపల్ కమిషనర్ వి.ప్రశాంతి

అనామలీస్ జాబితాలో ఉండి నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు నిర్దేశిత తేదీన విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్ వి.ప్రశాంతి సూచించారు. అనివార్య కారణాల వల్ల ఓటరు అందుబాటులో లేని సందర్భంలో కుటుంబ సభ్యులు ఎవరైనా హాజరు కావచ్చని తెలిపారు. హాజరు కాలేని వారికి మరోసారి అవకాశం కల్పిస్తామని చెప్పారు. నోటీసులు తీసుకునేందుకు ఇళ్లలో లేని వారికి తిరిగి నోటీసులు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అన్‌మ్యాపింగ్ ఓటర్ల జాబితాలను ఇప్పటికే సంబంధిత బీఎల్ఓలకు అందజేశామని పేర్కొన్నారు.

### ఇప్పటి వరకు నోటీసుల వివరాలు

నారాయణఖేడ్ పట్టణ పరిధిలో మొత్తం 4,782 నోటీసులు జారీ చేయగా.. ఇప్పటి వరకు 3,087 నోటీసులు అందజేశారు. ఇంకా 1,695 నోటీసులు అందజేయాల్సి ఉంది. మిగిలిన నోటీసులను కూడా సంబంధిత ఓటర్లకు అందజేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

---

# బీబీపేట్ సర్పంచ్ భర్తపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 29:**

కల్హేర్ మండలం బీబీపేట్ గ్రామపంచాయతీ పంచాయతీ కార్యదర్శిపై దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఎస్. చిరంజీవి డిమాండ్ చేశారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..ప్రభుత్వ విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేయడం వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమేనని, ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదని అన్నారు. బీబీపేట్ గ్రామపంచాయతీ సర్పంచ్ భర్తగా పేర్కొంటున్న వ్యక్తి పంచాయతీ కార్యదర్శిపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి, ఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రజలకు సేవలందించేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శికి న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధ్యులను వెంటనే అరెస్టు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.